ఫ్లాష్.. ఫ్లాష్..

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం

కంచిలి: కంచిలి బైపాస్ జాతీయ రహదారిపై సోమవారం అర్ధరాత్రి తరువాత జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. వజ్రపుకొత్తూరు మండలం నువ్వులరేవు గ్రామానికి చెందిన యువకులు బైక్‌పై ఇచ్ఛాపురం నుంచి పలాస వైపు వెళ్తుండగా.. ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను గమనించకుండా ఢీకొట్టారు. దీంతో తీవ్రంగా గాయపడిన ఇద్దరూ సంఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయినట్టు సోంపేట ఎస్సై పి.పారినాయుడు తెలిపారు.



ప్రమాద దృశ్యం

లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేయండి

శ్రీకాకుళం పాతబస్టాండ్: రానున్న లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. సోమవారం స్థానిక జిల్లా కోర్టు భవనంలోని న్యాయమూర్తులతో ఆన్‌లైన్ సమావేశం నిర్వహించారు. మార్చి 8న జరగనున్న లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేయాలని కోరారు.

న్యూస్‌రీల్

వాసుదేవుని బ్రహ్మోత్సవాలు ప్రారంభం



దాసాంజనేయ ఆలయం వద్ద పూజలు

కాశీబుగ్గ: మందసలోని వాసుదేవుని బ్రహ్మోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు దాసాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. కాశీబుగ్గ రూరల్ సీఐ తిరుపతిరావు ఆధ్వర్యంలో పటిష్ట చర్యలు చేపట్టారు. మందస ఎస్‌ఐ కె.కృష్ణప్రసాద్ పర్యవేక్షణలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు సంతోష్ పండా, వివేక్ సాతుర్వేది, అనిల్ పండా తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో భద్రతపై దిశానిర్దేశం



పరిశ్రమల భద్రతపై మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలోని పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాల అమలును కఠినంగా పరిశీలిస్తామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ హెచ్చరించారు. పారిశ్రామిక యూనిట్లలో రసాయన ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని, ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యమివ్వాలని ఆయన స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన జిల్లా సంక్షోభ నిర్వహణ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. అమోనియా, క్లోరిన్, ఎల్పీజీ, బ్యుటేన్ వంటి మండే స్వభావం ఉన్న వాయువులను పెద్ద పరిమాణంలో వినియోగించే పరిశ్రమల్లో కట్టుదిట్టమైన భద్రతా ప్రమాణాలు ఉండాలన్నారు. తరచూ మాక్ డ్రిల్ నిర్వహించాలని, విష వాయువులు వెలువడే పరిశ్రమల్లో ఎప్పటికప్పుడు భద్రతా ప్రమాణాలపై తనిఖీలు నిర్వహించాలన్నారు. ఇప్పటికే పూర్తి చేసిన తనిఖీల నివేదిక ఆధారంగా అన్ని పరిశ్రమలు మార్గదర్శకాలు పాటించేలా చర్యలు చేపట్టాలన్నారు.

పింఛన్ సొమ్ముతో విలేజ్ సర్వేయర్ పరారీ

జి.సిగడాం: మండలంలోని పెంట గ్రామ సచివాలయంలో సర్వేయర్‌గా విధులు నిర్వహిస్తున్న చదువుల భాను ప్రతాప్ రూ.49వేల పింఛన్ సొమ్ముతో పరారైనట్లు ఆ సచివాలయ సిబ్బంది సోమవారం తహసీల్దార్ ఎం.శ్రీకాంత్, ఎంపీడీఓ గుంటముక్కల రామకృష్ణారావులకు ఫిర్యాదు చేశారు. గ్రామ సచివాలయంలో 2024 జూన్ నుంచి పింఛన్ల పంపిణీ బాధ్యతలను ప్రతాప్‌కు అప్పగించారు. ఈ నెలకు సంబంధించి 1లక్ష 66వేల రూపాయల గాను 1లక్ష 17 వేలు రూపాయలను పంపిణీ చేశాడు. మిగతా సొమ్ము రూ.49వేలు లబ్ధిదారులకు ఇవ్వకుండా పరారయ్యాడని సచివాలయ సిబ్బంది ఫిర్యాదులో పేర్కొన్నారు. సంబంధిత పింఛన్ లబ్ధిదారులకు ఇబ్బంది రాకుండా సచివాలయ సిబ్బంది తమ సొంత నిధులు రూ. 33వేలు వెచ్చించి ఇచ్చారు. మరో రూ.16వేలు మృతి చెందిన లబ్ధిదారుల పింఛన్లని, వీటిని ప్రభుత్వానికి జమ చేయాల్సి ఉందన్నారు.

శివరాత్రి ఉత్సవాలకు పక్కాగా బందోబస్తు



ఆలయంలో అధికారులు, అర్చకులతో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వర రెడ్డి

జలుమూరు: శ్రీముఖలింగంలో శివరాత్రికి పూర్తిస్థాయిలో బందోబస్తు ఏర్పాట్లు చేయాలని ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి అన్నారు. సోమవారం శ్రీముఖలింగం శివరాత్రి ఉత్సవాలపై అర్చకులు, ఆలయ అధికారులు, పోలీసు అధికారులతో మాట్లాడారు. దక్షిణ ద్వారం గుండా వీఐపీల దర్శనాలను రద్దు చేయాలన్నారు. సామాన్యులు సులభంగా స్వామిని దర్శించుకునేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. రోప్ పార్టీలు అదనంగా ఏర్పాటు చేయాలని టెక్కలి డీఎస్పీ డి.ఎస్.ఆర్.వి.ఎస్.ఎన్ మూర్తికి ఆదేశించారు. చక్రతీర్థ స్నానాలకు అదనపు బందోబస్తు ఉండాలని, రోడ్డు, నది మార్గాలు శుభ్రం చేయాలని సూచించారు. గత ఏడాది జరిగిన పొరపాట్లు పునరావృతం కాకూడదన్నారు. దీనికి ముందు స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనతోపాటు సీఐలు ఇమ్మాన్యుయేల్ రాజు, జె.శ్రీనివాస్, సత్యనారాయణ, ఎస్‌ఐలు అశోక్‌బాబు సిబ్బంది పాల్గొన్నారు.

కాదేదీ దోపిడీకి అనర్హం

కీలక నేత సోదరుడి కనుసన్నల్లో అక్రమాలు

- మైనింగ్, ఇసుక, మద్యం, ధాన్యం కొనుగోళ్లు.. అన్ని రంగాల్లో ఆయనే ఆధిపత్యం
- గ్రానైట్ బ్లాకుల రవాణాలోనూ అక్రమాలే
- సామర్థ్యానికి మించి లోడింగ్ చేసి రవాణా
- ఇటీవల విశాఖ జిల్లా ఎండాడలో ప్రమాదానికి గురైన ఓ వాహనం



టెక్కలి జాతీయ రహదారిపై అధిక బరువుతో ఉన్న గ్రానైట్ బ్లాకులతో ప్రమాదకరంగా వెళుతున్న లారీ

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

జిల్లాలో ఎవరి గ్రానైట్ క్వారీ నడవాలి..? ఎవరిది ఆపేయాలి..? ఏ క్రషర్ ఉంచాలి.. ఎవరిది ఉంచకూడదు.. ఇలా మైనింగ్‌కు సంబంధించి ప్రతీదీ కీలక నేత సోదరుడే డిసైడ్ చేస్తున్నారు. మైనింగ్ అనే కాదు.. ఇసుక, మద్యం, ధాన్యం కొనుగోలు.. అన్నింటా ఆయనదే రాజ్యం. మైనింగ్ ఆధిపత్యం వల్ల ఆయన అనుయాయులంతా లాభపడుతుండగా.. మిగతా వ్యాపారులు మాత్రం క్వారీలు, క్రషర్లు మూసుకుని నష్టపోతున్నారు. గ్రానైట్ రాళ్లను రవాణా చేసే వాహనాల విషయంలోనూ వివక్ష చూపిస్తున్నారు. తమకు కావాల్సిన డబుల్ హౌసింగ్ లారీలకు మాత్రమే రాళ్ల రవాణా అప్పగించాలని, కాదన్న వారిని దూరం పెట్టాలని హుకుం జారీ చేశారు. ఫలానా నంబర్లు గల ట్రైలర్లకు మాత్రమే గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలని, మిగతా వాటిని ఎక్కడికక్కడ ఆపేయండని అధికార వర్గాలకు సూచన ప్రాయ ఆదేశాలిచ్చారు. ఈ వాహనాల్లో పరిమితికి మించి లోడింగ్ చేసుకుంటున్నా.. ఆయనను అడిగే నాథుడు లేకపోయాడు.

అంతా ఆయన కనుసన్నల్లోనే..

జిల్లాలో విస్తారంగా ఉన్న గ్రానైట్ క్వారీల నుంచి గ్రానైట్ బ్లాకులను ప్రతి రోజూ 50 నుంచి 100 వరకు ట్రైలర్లు జిల్లాలోని మిగతా ప్రాంతాలతో పాటు విశాఖపట్నం పోర్టుకు రవాణా చేస్తుంటాయి. విశాఖకు వెళ్లేవన్నీ పెద్ద బ్లాకులే. ఇంకా పెద్దవాటిని ఇతర రాష్ట్రాలకు, విదేశాలకు ఎగుమతి చేస్తుంటారు. ముఖ్యంగా మనకు జిల్లాకు సంబంధించి గ్రానైట్‌ను మలేషియా, సింగపూర్, జపాన్ తదితర దేశాలకు ఎగుమతి చేస్తారు. ఇతర రాష్ట్రాలకు వస్తే బెంగళూరుకు ఎక్కువగా తరలిస్తారు. మధ్యస్తంగా ఉన్న బ్లాకులను జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో ఉన్న పాలిషింగ్ యూనిట్లకు తరలిస్తుంటారు. ముఖ్యంగా నిమ్మాడ, పెదబమ్మిడి, వాంద్రాడ సమీపంలో 90 గ్రానైట్ పాలిషింగ్ యూనిట్లకు అత్యధికంగా గ్రానైట్ క్వారీల నుంచి రవాణా చేస్తుంటారు. అలాగే, మెళియాపుట్టి మండలం వెంకటాపురం ఏరియాలోని పాలిషింగ్ యూనిట్లకు పంపిస్తుంటారు. ఈ గ్రానైట్ బ్లాకుల రవాణా అంతా కీలక నేత సోదరుడు చెప్పిన ట్రైలర్లతోనే చేయాలి. మిగతా వాటికి అప్పగిస్తే ఆ క్వారీ టార్గెట్ అయిపోయినట్టే. అందుకనే ఎందుకొచ్చిన గొడవ అని ఆ తమ్ముడు చెప్పిన ట్రైలర్లకే క్వారీ యజమానులు అప్పగిస్తున్నారు. జిల్లాలో 90కి పైగా ట్రైలర్లు ఉన్నాయి. వీటిలో 30 ట్రైలర్లు మాత్రమే తమకు కావాల్సినవని చెప్పి, వాటికి మాత్రమే రవాణా అప్పగించాలని హుకుం జారీ చేశారు. దీంతో మిగతా 60కి పైగా ఉన్న ట్రైలర్ల యజమానులకు రవాణా పని దొరక్క నష్టపోతున్నారు.

చర్యలు తీసుకోరే..

దీనికి తోడు పరిమితికి మించి ఏకంగా 100 టన్నుల సామర్థ్యంతో బ్లాకులను తరలిస్తున్నా అధికారులు కిమ్మనడం లేదు. 'సోదరుడు' చెప్పిన నంబర్లు గల లారీలు కావడంతో వాటిని ఆపే ధైర్యం చేయలేకపోతున్నారు. ఇలా పరిమితికి మించి, సామర్థ్యాన్ని దాటి రవాణా చేసిన ట్రైలర్ ఒకటి ఇటీవల విశాఖ జిల్లా ఎండాడ దిశా మహిళా పోలీసు స్టేషన్ సమీపంలో ప్రమాదానికి గురైంది. ఈ సమయంలో భారీ బండ రాళ్లు(బ్లాకులు) జాతీయ రహదారికి అడ్డంగా పడిపోయి వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. పీఎంపాలెం పోలీసులు క్రేన్ల సహాయంతో వాటిని తొలగించడంతో అక్కడ ట్రాఫిక్ క్లియర్ అయింది. ఈ ఘటనలో కొందరికి గాయాలు కూడా అయ్యాయి. ఇచ్ఛాపురం, టెక్కలి, పలాస, మెళియాపుట్టి పరిసర ప్రాంతాల నుంచి రోజు వందల సంఖ్యలో గ్రానైట్ బ్లాకుల రవాణా అడ్డగోలుగా జరుగుతుందని, పరిమితికి మించి లోడింగ్ చేసి రవాణా చేస్తున్నారని, ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని ఇటీవల కొందరు జిల్లా ఉన్నతాధికారికి, రవాణ శాఖ అధికారులకు ఫిర్యాదు కూడా చేశారు. అయినప్పటికీ స్పందన లేదన్న వాదనలు ఉన్నాయి.



భారీ గ్రానైట్ బ్లాకులతో రవాణా అవుతున్న ట్రైలర్‌ను చూడండి. 22 టైర్ల గల ఈ వాహనంపై రాష్ట్ర పరిధిలో 57 మెట్రిక్ టన్నుల బ్లాకులను మాత్రమే రవాణా చేయాలి. రాష్ట్రం దాటితే 55టన్నుల సామర్థ్యం గల బ్లాకులనే రవాణా చేయాలి. కానీ, ఇప్పుడీ ట్రైలర్లపై రాష్ట్రంలోనే కాదు.. జిల్లాలోనే 100 టన్నులకు పైగా బరువుల గల బ్లాకులను ఎక్కించి రవాణా చేస్తున్నట్టుగా తెలుస్తోంది. వీటిని ఏ ఒక్క అధికారి అడ్డుకోవడం లేదు.



విశాఖలోని ఎండాడలో జరిగిన ప్రమాదం కారణంగా రోడ్డుపైన పడ్డ బండ రాళ్లు (బ్లాకులు)



అన్నింటా ఆయనే..

జిల్లాకు చెందిన కీలక నేత సోదరుడు అంతా తానై వ్యవహరిస్తున్నారు. మద్యం, ధాన్యం, ఇసుక, మైనింగ్.. ఇలా అన్నింటిలోనూ వేలు పెడుతున్నారు. అతగాడి జోక్యం ఉంటే చాలు ఆ అక్రమాల జోలికి అధికారులు వెళ్లడం లేదు. 'ఆయనున్నాడు మనకెందుకులే.. మనకు ఎంతో కొంత వస్తుంది దాంతో సరిపెట్టుకుందాం' అన్న ధోరణి కనబరుస్తున్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఇక్కడ ఇసుక దందా చేస్తున్నారు. ఈ విషయంలో కీలక నేత సోదరుడితో పాటు ఆమదాలవలస, పాతపట్నం, నరసన్నపేట, శ్రీకాకుళం నేతలకు భాగస్వామ్యం ఉంది. కానీ, సంబంధిత వర్గాలు మొత్తం కీలక నేత సోదరుడు చెప్పినట్టుగానే చేస్తున్నాయి. ఇక జిల్లాలోని మూడింతల మద్యం షాపులు కీలక నేత సోదరుడి కనుసన్నల్లోనే ఉన్నాయి. చాలా వరకు షాపులు ఆయన అనుయాయులు, కుటుంబీకులకే దక్కాయి. జిల్లాలో అక్రమాలకు దోహదపడ్డ మరో ప్రధాన అంశం ధాన్యం కొనుగోళ్లు. జిల్లాలో ధాన్యం కొనుగోలు లక్ష్యాలు, మిల్లర్లకు ధాన్యం కేటాయింపులు, గోడౌన్‌లలో కస్టమ్ మిల్లింగ్ రైస్ స్టాక్ చేసేందుకు మిల్లర్ల దగ్గరి నుంచి ముడుపులు, సీఎంఆర్ కింద ఇవ్వాల్సిన బియ్యం బదులు పీడీఎస్ బియ్యం ఇచ్చే విషయంలో.. ఇలా ప్రతి దాంట్లోనూ ఆయన నిర్ణయాలే అమలవుతున్నాయి. మిల్లర్లు ఆవేదనతో ఉన్నా అధికారానికి భయపడి కక్కలేక, మింగలేక కుమిలిపోతున్నారు.

విదేశీ ఉద్యోగాల పేరిట టోకరా

విదేశీ ఉద్యోగాల పేరిట మోసపోయిన నిరుద్యోగులు



- జిల్లాలో 350 మంది బాధితులు
- ఇచ్ఛాపురం కేంద్రంగా మోసం

ఇచ్ఛాపురం రూరల్: ఇచ్ఛాపురం కేంద్రంగా జరిగిన ఘరానా మోసం తాజాగా వెలుగులోకి వచ్చింది. విదేశాల్లో ఉద్యోగాల పేరిట సుమారు 350 మందికి టోకరా వేసి సుమారు ఆరున్నర కోట్ల రూపాయలతో ఓ ప్రబుద్ధుడు పరారయ్యాడు. ఇచ్ఛాపురానికి 70 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఒడిశా చీకటి బ్లాక్ పార్వతీపురం గ్రామానికి చెందిన కొచ్చెర్ల ధర్మరాజు పోలెండ్‌లో వలస కూలీగా పనిచేస్తున్నాడు. ఏజెంట్‌గా అవతారం ఎత్తి స్థానిక యువకులతో ఉన్న బంధుత్వాన్ని ఆసరాగా చేసుకొని ఇటలీలో మంచి ఉద్యోగాలు ఉన్నాయని స్థానికులైన కాయి దిలీప్(తేలుకుంచి), శ్రీను(బెజ్జిపద్ర)లతో ఉన్న బంధుత్వంతో ప్రచారం చేసుకున్నాడు. ఫ్రూట్స్ కటింగ్, ప్యాకింగ్, వైన్, బీర్ల కంపెనీలో ప్యాకింగ్ వంటి ఆకర్షణీయమైన ఉద్యోగాలు, కష్టం లేని పని, రూ.లక్షల్లో జీతం అంటూ నమ్మబలకడంతో జిల్లా నుంచి సుమారు 350 మంది వరకు ఈయన వలలో పడ్డారు. ఇచ్ఛాపురం కేంద్రంగా ఓ లాడ్జిని తీసుకొని తొలి విడతలో గత ఏడాది జూలై 26న 75 మందిని ఇంటర్వ్యూ చేసి వారి దగ్గర రూ.ఇరవై వేలు అడ్వాన్స్, తర్వాత రూ.1.35 లక్షలు చొప్పున వసూలు చేశాడు. అలాగే నెల తిరక్క ముందు హైదరాబాద్‌లో ఇంటర్వ్యూ పేరిట 175 మంది వద్ద రూ.1.35 లక్షలు చొప్పున, ఈ ఏడాది జనవరిలో శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి శ్రీమారుతీ ఇన్‌స్టిట్యూట్‌లో 120 మందికి ఇంటర్వ్యూ నిర్వహించి వారి వద్ద నుంచి రూ.50వేలు చొప్పున వసూలుతో పాస్‌ఫొటోలు తీసుకున్నాడు. ఫిబ్రవరి నెలాఖరు నాటికి ఇటలీ వెళ్లేందుకు సిద్ధం కావాలని నమ్మబలికాడు. ఇచ్ఛాపురం పట్టణంలోని ఓ మెడికల్ ల్యాబ్‌లో 350 మంది యువకులకు మెడికల్ టెస్ట్‌లు నిర్వహించి యువకులను మరింత నమ్మించాడు. ఈ మెడికల్ టెస్ట్‌లో ఒక్కొక్కరి వద్ద రూ.2,500 నుంచి రూ.3,200 వరకు వసూలు చేసినట్లు యువకులు విలేకరులకు తెలిపారు.



సూట్ కేసులో నిరుద్యోగులు ఇచ్చిన డబ్బులు



అంతా బోగస్సే..

ఇటలీ వెళ్లేందుకు మొదటి విడతలో 30 మంది ఢిల్లీ వచ్చి పాస్‌పోర్టు చెకింగ్, స్లాట్ బుకింగ్ చేసుకోవాలని కోరడంతో జిల్లా నుంచి శుక్రవారం ఢిల్లీ వెళ్లిన యువకులకు ఆదివారం రాత్రి పిడుగులాంటి వార్త చెవిన పడింది. ఇక్కడ ఇలాంటిది ఏమీ లేదని, అంతా బోగస్ అని తెలియడంతో లబోదిబోమన్నారు. ఇటలీ వెళ్లేందుకు డబ్బులు చెల్లించిన నిరుద్యోగుల గ్రూపులో సోమవారం ఉదయం ఏజెంట్ ధర్మరాజు వాయిస్ మెసేజ్ పెడుతూ 'సారీ గయ్స్... మనమంతా మోసపోయాం. మీతో పాటు నేనూ కూడా మోసపోయాను' అంటూ ఫోన్ స్విచ్చాఫ్ చేయడంతో అందుబాటులో ఉన్న యువకులంతా సోమవారం ఇచ్ఛాపురం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఉన్న సీఐ ఎం.చిన్నంనాయుడును కలసి తమ గోడును వెళ్లబుచ్చుకున్నారు. తామంతా మోసపోయామని, తమకు న్యాయం చేయాలంటూ వేడుకున్నారు. పట్టణం పోలీస్ స్టేషన్‌లో బాధిత యువకులు ఫిర్యాదు చేసినట్లు బాధిత యువకులు తెలిపారు.

అప్పు చేసి డబ్బులు చెల్లించాను



మాది టెక్కలి మండలం గోకర్లపల్లి. ఇటలీలో మంచి ఉద్యోగానికి ఇంటర్వ్యూ జరుగుతుందని స్నేహితుల ద్వారా తెలుసుకొని రెండో బ్యాచ్‌గా ఇచ్ఛాపురం సూర్యా లాడ్జిలో మొదటి విడతగా రూ.30వేలు చెల్లించాను. తర్వాత హైదరాబాద్‌లో రూ.1.28లక్షలు ఇచ్చాను. ఇటలీలో మంచి ఉద్యోగం అని చెప్పడంతో మా పేరెంట్స్ అప్పు చేసి డబ్బులు ఇచ్చారు. ఇప్పుడు అంతా బోగస్ అంటున్నారు.

– పడాల గణేష్, టెక్కలి మండలం

స్థానికుల పరిచయంతో బలయ్యా..



ఇచ్ఛాపురం మండలం ధర్మపురం గ్రామం మాది. డిగ్రీ వరకు చదువుకున్నాను. ఏజెంట్ ధర్మరాజు మా పక్క ఒడిశాకు చెందిన వ్యక్తి కావడంతో పాటు మా ప్రాంతంలో ఏజెంట్‌కు బంధువులు ఉండటంతో వారి ద్వారా నమ్మి ఇచ్ఛాపురం లాడ్జీలో రూ.50వేలు చెల్లించాను. ఇటలీలో వైన్ ప్యాకింగ్ ఉద్యోగం ఇప్పిస్తానంటూ నమ్మబలికాడు. ఇచ్ఛాపురం గవర్నమెంట్ ఆస్పత్రికి ఎదురుగా ఉన్న ల్యాబ్‌లో మాకు మెడికల్ టెస్ట్‌లు జరిగాయి. ఈ రోజు ఉదయం 'అంతా బోగస్...మోసపోయాం' అంటూ మెసేజ్ పెట్టడంతో మాకుతెలిసింది. మాకు న్యాయం జరగాలి. – సాహుకారి భానుప్రకాష్,

ధర్మపురం, ఇచ్ఛాపురం మండలం

మంత్రి అండతో మైనింగ్ దోపిడీ



టెక్కలి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్, నాయకులు

- వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్

టెక్కలి: జిల్లాలో మంత్రి అచ్చెన్నాయుడు అండతో కింజరాపు కుటుంబం మైనింగ్ దోపిడీలు, ధాన్యం కొనుగోలులో అక్రమాలకు పాల్పడుతున్నారని, రాజస్థాన్‌కు చెందిన కొంత మంది బ్రోకర్లతో క్వారీలు, గ్రానైట్ పరిశ్రమల నుంచి కమీషన్‌ల దుకాణాలు తెరిచారని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ దుయ్యబట్టారు. సోమవారం టెక్కలి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కూటమి పాలనలో గ్రామస్థాయి నుంచి కక్ష సాధింపు చర్యలకు ప్రాధాన్యం ఇస్తున్నారు తప్ప ఎన్నికల మునుపు ప్రజలకిచ్చిన సూపర్ సిక్స్ హామీలపై కనీసం దృష్టి సారించడం లేదన్నారు. ఇటీవల చంద్రబాబు ప్రకటించిన పాలనాపరమైన ర్యాంకింగ్‌లో జిల్లాకు చెందిన మంత్రి అచ్చెన్నాయుడుకు 17వ ర్యాంకు వచ్చిందని, అయితే కక్ష సాధింపుల్లో మాత్రం మొదటి ర్యాంకులో ఉన్నారని తిలక్ ఎద్దేవా చేశారు. జిల్లాలో వ్యవసాయ రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. కేంద్రమంత్రిగా రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రిగా అచ్చెన్నాయుడు రైతులను పట్టించుకోకుండా ఏం వెలగబెడుతున్నారని నిలదీశారు. గతంలో అనేక కుంభకోణాల్లో ఇరుక్కుపోయిన బోయిన రమేష్‌కు రైస్ మిల్లర్స్ అసోసియేషన్ బాధ్యతలు అప్పగించి ధాన్యం కొనుగోలులో మంత్రి సోదరుడు హరిప్రసాద్ నేతృత్వంలో కోట్లాది రూపాయల అక్రమాలకు పాల్పడ్డారని తిలక్ దుయ్యబట్టారు. వైఎస్ జగన్ హయాంలో పోర్టు పనులు మొదలయ్యాయని, దానికి అనుసంధానంగా రోడ్లకు ప్రతిపాదిస్తే.. ఆ రోడ్లు తామే ఇచ్చామంటూ బాబాయ్, అబ్బాయ్‌లు గొప్పలు చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, దళితులపై కూటమి నాయకులు దాడులు చేస్తుంటే పోలీసులు పట్టించుకోకుండా తిరిగి బాధితుల పైనే కేసులు నమోదు చేస్తున్నారని అన్నారు. దీనిపై తిరుగుబాటు తప్పదన్నారు. ఒకే సామాజిక వర్గానికి చెందిన పోలీసులు, విజిలెన్స్ ఎస్పీ కూటమిగా చేరి కింజరాపు కుటుంబం చెప్పినట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో నందిగాం ఎంపీపీ ఎన్.శ్రీరామ్మూర్తి, పార్టీ నియోజకవర్గ స్థాయి వివిధ అనుబంధ విభాగాల నాయకులు ఎస్.సత్యం, జీ.వి.రెడ్డి మాష్టారు, ఎస్.హేమసుందర్‌రాజు, ఆర్.మల్లయ్య, బి.మోహన్‌రెడ్డి, కె.సంజీవ్, డి.రామకృష్ణారెడ్డి, పోలాకి మోహన్, పి.వెంకట్రావు, దివాకర్, ఎస్.భీమారావు, కె.జీవన్, కె.రామరాజు, బి.వెంకటరమణ, పి.మోహన్, పి.బాలకృష్ణ, మదీన్, హెచ్.గోవిందరావు, పి.కరుణాకర్, ఎ.మల్లేష్, హెచ్.లక్ష్మణ్, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్–2 పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్–2 మెయిన్ పరీక్షలు ఈ నెల 23న జరగనున్నాయని, వాటిని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. పరీక్షల నిర్వహణపై కోఆర్డినేటింగ్ అధికారులు, లైజనింగ్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లతో కలెక్టర్ సమావేశ మందిరంలో సోమవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వర రావుతో కలిసి సెంటర్లవారీగా ఏర్పాట్లపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ, గ్రూప్ 2 పరీక్షల నిర్వహణకు అన్ని రకాలుగా సన్నద్ధం కావాలని ఆదేశించారు. 23వ తేదీ ఉదయం 10 నుంచి 12.30 వరకు, మధ్యాహ్నం 3 నుంచి 5.30 వరకు పరీక్ష జరుగుతుందని చెప్పారు. దీని కోసం శ్రీకాకుళం, ఎచ్చెర్లలో మొత్తం 15 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని, 5535 మంది సభ్యులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు.

పరీక్ష కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకొనే విధంగా ఆర్టీసీ బస్సులు నడపాలన్నారు.

విశిష్ట సంఖ్య రిజిస్ట్రేషన్ వేగవంతం చేయాలి



కోమర్తి సచివాలయంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి త్రినాథ స్వామి

నరసన్నపేట: ప్రజలకు ఆధార్ కార్డు లాగానే రైతులకు గుర్తింపు నంబర్లు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి త్రినాథస్వామి అన్నారు. మండలం కోమర్తి సచివాలయంలో రైతులకు విశిష్ట సంఖ్య రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఎలా జరుగుతుందనే దానిపై ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడారు. రైతులకు యూనిక్ ఐడీ చాలా ముఖ్యమని అన్నారు. ప్రభుత్వం నుంచి ఏ పథకం రైతులు పొందాలన్నా ఈ సంఖ్య ఉండాలని, రైతులు గమనించి సంబంధిత వీఏఏ వద్దకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. అలాగే ఈ నెల 28 కల్లా ఈ ప్రక్రియ పూర్తి చేయాలని వీఏఏలకు ఆదేశించారు. కోమర్తి సచివాలయంలో రిజిస్ట్రేషన్ ఎలా ఉందని వీఏఏ కల్యాణిని అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకూ 190 మంది రైతుల పేర్లు రిజిస్ట్రేషన్ చేశామని తెలిపారు. మిగిలిన రైతులు కూడా 28 కల్లా రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలని సూచించారు. అలాగే రబీ పంటల నమోదు ప్రక్రియ పై ఆరా తీశారు. జిల్లా వ్యవసాయాధికారి వెంట నరసన్నపేట ఏడీ రవీంద్రభారతి, మండల వ్యవసాయాధికారిణి కె. సునీత తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

వసతి గృహాల్లో సమస్యలపై ఆరా


వసతి గృహాన్ని పరిశీలిస్తున్న సన్యాసినాయుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు సోమవారం జిల్లా కేంద్రంలోని బీసీ హాస్టల్‌ను సందర్శించారు. పారిశుద్ధ్యం, పరిశుభ్రత, మౌలిక వసతులు, ఆహార సదుపాయాలపై ఆరా తీశారు. విద్యార్థులకు చక్కటి భోజనం, వసతులు కల్పించాలని ఆదేశించారు.

కాశీబుగ్గలో ఉద్రిక్తత


జేసీబీతో షాపును తొలగిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలోని మూడు రోడ్ల కూడలి వద్ద ఫుట్‌పాత్‌పై ఉన్న పూజా సామగ్రి షాపు తొలగింపు సోమవారం ఉద్రిక్తతకు దారితీసింది. మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు ఆధ్వర్యంలో జేసీబీతో షాపును తొలగిస్తుండగా దుకాణదారుడి కుటుంబ సభ్యులు అడ్డుకున్నారు. అధికారులతో వాగ్వాదానికి దిగడంతో తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. పోలీసుల రంగ ప్రవేశం చేసి దుకాణదారులను అదుపుచేశారు. ఈ క్రమంలో షాపు యజమాని కఠారి శ్యామ్ ఒంటిపై నూనె పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే పోలీసులు అడ్డుకుని శ్యామ్‌ను అరెస్టు చేశారు. కుటుంబ సభ్యులను కూడా పోలీసు స్టేషన్‌కు తరలించారు.

ఖాళీ కోళ్ల ఫారం దగ్ధం


మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

రణస్థలం: మండలంలోని పాతర్లపల్లి వెంకటేశ్వర కాలనీలో ఎల్.శ్రీరాములుకు చెందిన ఖాళీ కోళ్ల ఫారం సోమవారం దగ్ధమైంది. మధ్యాహ్నం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. రణస్థలం అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపులోకి తీసుకొచ్చారు. సుమారు రూ.1.5 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు రణస్థలం అగ్నిమాపకాధికారి పైల అశోక్ తెలిపారు.

జర్నలిస్టులపై దాడులు అమానుషం


నిరసన తెలియజేస్తున్న సంఘ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండల ప్రజాశక్తి విలేకరిపై తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షుడు దాడి చేయడాన్ని నిరసిస్తూ జర్నలిస్టు సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శ్రీకాకుళం అంబేడ్కర్ జంక్షన్ వద్ద సోమవారం మానవహారం చేశారు. జర్నలిస్టుల రక్షణకు ప్రభుత్వం చట్టాన్ని తీసుకురావాలని నినదించారు. ఇదే పరిస్థితి పునరావృతమైతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర నాయకులు భవిరి కృష్ణమూర్తి, సీపీఐఎంఎల్ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, వాకర్స్ ఇంటర్నేషనల్ పూర్వపు గవర్నర్ గేదెల ఇందిరాప్రసాద్, జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

పట్టపగలు చోరీచేసింది పక్కింటోడే..

- వీడిన శాలిహుండం చోరీ కేసు మిస్టరీ
- పండ్లవ్యాపారి ఇంట్లో 17 తులాలకు పైగా ఆభరణాలు మాయం చేసిన ఆటోడ్రైవర్ అరెస్టు


రికవరీ చేసిన బంగారు ఆభరణాలు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వివేకానంద

శ్రీకాకుళం క్రైమ్: గత నెల 22న గార మండలం శాలిహుండంలోని ఓ పండ్లవ్యాపారి ఇంట్లో పట్టపగలు జరిగిన చోరీ కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. బాధితుడి ఇంటి పక్కన నివాసముంటున్న ఆటోడ్రైవరే ఈ చోరీకి పాల్పడినట్లు నిర్ధారించి నిందితుడిని అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించి జిల్లా పోలీసు కార్యాలయంలో డీఎస్పీ వివేకానంద సోమవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు.

నాలుగో ప్రయత్నంలో..

శాలిహుండం గ్రామానికి చెందిన ఉర్జాన ఆదినారాయణ, రమణమ్మలు సింగుపురం కూడలి వద్ద పండ్ల వ్యాపారం చేస్తుంటారు. ఉదయం వెళ్తే రాత్రి వరకు తిరిగిరారు. జనవరి 22న ఎప్పట్లాగే ఉదయం ఏడు గంటలకు వ్యాపారానికని వెళ్లిన దంపతులు రాత్రి ఎనిమిదిన్నరకు వచ్చేసరికి వెనుక తలుపులు తీసివున్నాయి. వాస్తవానికి దంపతులే తలుపులు వేయడం మరిచారు. రమణమ్మ తాను వేసుకున్న బంగారు గాజులు, గొలుసు బీరువాలో పెట్టడానికి తాళాలు వెతకగా కనిపించకపోవడంతో షరాబుని పిలిపించి తెరిపించింది. బీరువాలో తన ఇద్దరు కుమార్తెలకు చెందిన ఆరు తులాల గొలుసు, నాలుగు తులాల హారం, రెండున్నర తులాల నెక్లెస్, రెండు తులాల వొంటిపేట గొలుసు కనిపించకపోవడంతో నిర్ఘాంతపోయింది. వెంటనే గార స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో సీఐ పైడపునాయుడు, ఎస్‌ఐ జనార్దన దర్యాప్తు చేపట్టారు. స్థానికుల పనేనని గుర్తించి ఓ వ్యక్తి కదలికలపై నిఘా పెట్టారు.

అప్పుల బెడద ఎక్కువై..

రమణమ్మ పక్కింట్లో నివాసముంటున్న జోగి రాజు ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ భార్యాబిడ్డలను పోషిస్తున్నాడు. అప్పులు ఎక్కువ కావడంతో దొంగతనం చేయాలని నిశ్చయించుకున్నాడు. ఉదయం వెళ్లి రాత్రి వరకు తిరిగి రాని రమణమ్మ ఇల్లే దొంగతనానికి సరైనదని భావించి రెండు, మూడుసార్లు ప్రయత్నించాడు. నాలుగోసారి గత నెల 22న చోరీ చేశాడు. చోరీ సొత్తును రాజు తన ఇంటి మేడపైన హోమ్ థియేటర్ స్పీకర్ బాక్సుల్లో దాచాడు. అప్పుల వారి తాకిడి ఎక్కువైపోవడంతో ఈ నెల 16న మధ్యాహ్నం 3 గంటలకు ఆరు తులాల ఆభరణాలు తనఖా పెట్టేందుకు బయల్దేరాడు. అప్పటికే రాజుపై నిఘా పెట్టిన పోలీసులు అతన్ని ఇంటివద్దే అదుపులోకి తీసుకుని విచారించగా మొత్తం విషయాన్ని బయటపెట్టాడు.

ప్రతిభకు ప్రశంసలు..

కేసును చాకచక్యంగా ఛేదించిన రూరల్ సీఐ సీహెచ్ పైడపునాయుడు, ఎస్‌ఐ జనార్దన, వన్‌టౌన్ ఎస్‌ఐ హరికృష్ణ, ఏఎస్‌ఐ శ్రీనివాసరావు, పీసీలు సూరిబాబు, జగదీష్, రమణమూర్తి, బాలకృష్ణలను ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి ప్రత్యేకంగా అభినందించినట్లు డీఎస్పీ చెప్పారు. నిందితుని వద్ద మొత్తం సొత్తును రికవరీ చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

విశాఖ ఉక్కుపై బిల్లు పాస్ చేయించాలి


సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయబోమన్న నిర్ణయం మంచిదే అయినప్పటికీ పార్లమెంట్‌లో బిల్లు పాస్ చేసి నిర్ణయం తీసుకోవాలని సమాజ వికాస సేవా సంఘం సభ్యులు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు కార్యాలయంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖలో భూకుంభ కోణాలు, స్టీల్ ప్లాంట్‌కు నాణ్యతలేని బొగ్గును సరఫరా చేసే అదానీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వల్ల ప్రజలంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. పర్యావరణాన్ని నాశనం చేసే థర్మల్ ప్లాంట్ల ఏర్పాటు నిర్ణయాలు వెనక్కి తీసుకోవాలని కోరారు. సమావేశంలో అధ్యక్షుడు ఎస్.చంద్రశేఖర్, కార్యదర్శి బొడ్డేపల్లి సత్యనారాయణ, కె.గోపాల్, ఎస్.ధనుంజయ, ఎ.సత్యన్నారాయణ పాల్గొన్నారు.

పకడ్బందీగా పబ్లిక్ పరీక్షలు

- పదో తరగతి పరీక్షలకు 28,984 మంది విద్యార్థులు
- ఓపెన్ టెన్త్ పరీక్షలకు 807 మంది విద్యార్థులు
- ఓపెన్ ఇంటర్ పరీక్షలకు 1553 మంది విద్యార్థులు
- అధికారుల సమీక్షలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఈ ఏడాది పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్నందున ఎటువంటి మాస్ కాపీయింగ్, ఇతర ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీగా నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారులు సిద్ధం కావాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. పరీక్షల నిర్వహణపై కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ప్రథమ చికిత్స కేంద్రాలను సిద్ధం చేసి పారా మెడికల్ సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. స్ట్రాంగ్ రూమ్‌ల నిర్వహణపై దృష్టి సారించాలన్నారు. రెవిన్యూ డివిజనల్ అధికారులు వారి స్థాయిలో సమావేశం నిర్వహించాలని సూచించారు.

- సెకండరీ ఎడ్యుకేషన్ బోర్డు పదో తరగతి పరీక్షలు మార్చి 17 నుంచి ఏప్రిల్ 1 వరకు జరుగుతాయని కలెక్టర్ తెలిపారు. ఉదయం 9.30 నుంచి 12.45 గంటల వరకు పరీక్షల నిర్వహణ ఉంటుందన్నారు. జిల్లాలో 28,984 మంది విద్యార్థులు హాజరుకానున్నారని చెప్పారు. 149 కేంద్రాలకు 149 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, ఏడు ఫ్లయింగ్ స్క్వాడ్స్ బృందాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు.
- ఏపీ సార్వత్రిక విద్యా సంస్థ నిర్వహించే ఓపెన్ స్కూల్ పదోతరగతి పరీక్షలు కూడా ఎస్ఎస్‌సీ పరీక్షల సమయంలోనే జరగనున్నాయని కలెక్టర్ చెప్పారు. 807 మంది విద్యార్థులు హాజరుకానున్నారని, జిల్లాలో 8 కేంద్రాలకు ఎనిమిది మంది చీఫ్ సూపరింటెండెంట్లు, రెండు ఫ్లయింగ్ స్క్వాడ్స్ బృందాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు.
- ఓపెన్ ఇంటర్ పరీక్షలు మార్చి 3 నుంచి 15వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగనున్నాయని కలెక్టర్ తెలిపారు. 1553 మంది హాజరు కానున్నారని చెప్పారు. 8 కేంద్రాలకు 8 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, రెండు ఫ్లయింగ్ స్క్వాడ్స్ బృందాలను ఏర్పాటు చేశామని వివరించారు.
- జిల్లా విద్యాశాఖ అధికారి తిరుమల చైతన్య మాట్లాడుతూ పరీక్షలు విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, శ్రీకాకుళం రెవెన్యూ డివిజనల్ అధికారి సాయి ప్రత్యూష, ఏసీఈ లియాఖత్ అలీఖాన్, జిల్లా ఒకేషనల్ అధికారి తవిటినాయుడు, జిల్లా వైద్యారోగ్య అధికారి బాల మురళీకృష్ణ, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ కిరణ్‌కుమార్, జిల్లా ఉద్యాన అధికారి వరప్రసాద్, యూత్ కో-ఆర్డినేటర్ ఉజ్వల్, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీలను పట్టించుకోని కూటమి ప్రభుత్వం


గార: రోడ్డుపై నిరసన చేపడుతున్న అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు

- సమస్యలు పరిష్కరించకుంటే పోరాటం తీవ్రతరం చేస్తాం
- ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ ఆధ్వర్యంలో ధర్నా


శ్రీకాకుళంలోని 80అడుగుల రోడ్డులోని ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

శ్రీకాకుళం అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలు వెంటనే పరిష్కరించాలని, లేదంటే పోరాటం తీవ్రతరం చేస్తామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.కళ్యాణి హెచ్చరించారు. అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం శ్రీకాకుళంలోని 80 అడుగుల రోడ్డులో ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో చేసిన అంగన్‌వాడీలు సుదీర్ఘ పోరాటం చేశారని, ఆ సమయంలో కూటమి నాయకులు హామీలు ఇచ్చారని, వారి ప్రభుత్వం ఏర్పడినా నేటికీ అమలు చేయకపోవడం అన్యాయమని మండిపడ్డారు. ధరలు విపరీతంగా పెరుగుతున్నా 2019 నుంచి జీతాలు పెరగలేదన్నారు. దీనికితోడు యాప్‌లు, నూతన విధానాలతో పని భారాలు పెంచుతున్నారని వాపోయారు. అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

రానున్న బడ్జెట్ సమావేశాల్లో అంగన్‌వాడీ సమస్యలపై చర్చించాలని, హెల్పర్ల ప్రమోషన్లలో రాజకీయ జోక్యం అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కె.సూరయ్య, పట్టణ కన్వీనర్ ఆర్. ప్రకాష్, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు కె.జ్యోతి, జి.రాజేశ్వరి, కె.సంధ్యారాణి, అంజలీభాయ్, కృష్ణభారతి, లక్ష్మి, లక్ష్మినారాయణ, అంగన్‌వాడీలు తదితరులు పాల్గొన్నారు.

శ్రీముఖలింగంలో పట్టాభిషేకం


అనంతవర్మ చోడ గంగదేవుడి చిత్రపటాలతో నిర్వాహకులు

జలుమూరు: దక్షిణ కాశీగా పేరొందిన శ్రీముఖలింగంలో సోమవారం కళింగరాజు అనంత వర్మ చోడ గంగదేవుడి 947వ పట్టాభిషేకం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, వారాహి అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. నాటి రాజు పాలన, సైనిక శక్తి, ఆలయాల అభివృద్ధి, శ్రీముఖలింగం రాజధానిగా చేసుకొని ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల్లో నిర్మించిన ఆలయాలు, శాసనాలను ఒడిశా ప్రాజెక్టు అధికారి విష్ణు మోహన్ వివరించారు. నాటి కట్టడాలు విశిష్టతను కటక్ చాపర్ కో కన్వీనర్ దీపక్‌కుమార్ నాయక్ తెలియజేశారు. గంగదేవుడి చిత్రపటాలతో ప్రదక్షిణలు చేసి ఆలయ కార్యాలయంలో భద్రపరిచారు. కళింగ రాజ్యంతోపాటు జిల్లాలో ప్రముఖ దేవాలయాలైన శ్రీకూర్మం, అరసవల్లి, శ్రీముఖలింగం ఆలయాల అభివృద్ధికి ఇచ్చిన దానాలు, తీసుకున్న పాలనాపరమైన నిర్ణయాలను పీఏఎస్ కార్యదర్శి, కో కన్వీనర్ మురళీధర్, తరుణ్ సింగ్‌లు వివరించారు. భావితరాలకు ఆనాటి రాజుల చరిత్ర తెలియజేసేందుకు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

జె.ఆర్.పురం పోలీస్‌స్టేషన్‌ను అర్ధరాత్రి తనిఖీ చేసిన ఎస్పీ

రణస్థలం: మండల కేంద్రంలోని జె.ఆర్.పురం పోలీస్ స్టేషన్, పైడిభీమవరంలోని జిల్లా ఇసుక చెక్‌పోస్టును ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి ఆదివారం అర్ధరాత్రి తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లో ఓ హోంగార్డు, కానిస్టేబుల్ నిద్రపోయి ఉండగా.. అందులో కానిస్టేబుల్ మద్యం సేవించినట్లు గుర్తించారు. బ్రీత్ ఎనలైజర్ మిషన్ పెట్టగా 86 పాయింట్లు రావడంతో వెంటనే ఆస్పత్రికి తరలించి వైద్య పరీక్షలు చేయించినట్లు సమాచారం. ఈ ఘటనపై ఇన్‌చార్జి ఎస్సై జి.లక్ష్మణరావు వద్ద ప్రస్తావించగా.. కానిస్టేబుల్‌పై విచారణ జరుగుతోందని, పూర్తి వివరాలు త్వరలో తెలియజేస్తామని చెప్పారు. కాగా, సోమవారం ఎస్పీ కార్యాలయ టెక్నికల్ సిబ్బంది స్టేషన్‌కు చేరుకుని సీసీ పుటేజీలు పరిశీలించారు. అక్రమ ఇసుక తరలింపులో లంచావతారం ఎత్తిన ఓ అధికారిపై ఉన్నతాధికారులు ఆరా తీస్తున్న సమయంలో ఎస్పీ మహేశ్వరరెడ్డి జె.ఆర్.పురం పోలీస్ స్టేషన్‌ను అర్ధరాత్రి తనిఖీ చేయడం చర్చనీయాంశమైంది.

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కె.మోహనరావు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయాలని, అందుకు అవసరమైన నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో పూర్తిస్థాయిలో కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి.ప్రసాదరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక రైతు సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వంశధార కాలువల ఆధునికీకరణకు రూ.1500 కోట్లు కేటాయించాలన్నారు. ఆఫ్‌షోర్ ప్రాజెక్టు ప్రారంభించి 17 ఏళ్లయినా నేటికీ 40 శాతం పనులు కూడా జరగలేదని తెలిపారు. 2013 భూసేకరణ చట్ట ప్రకారం నిర్వాసితులకు పరిహారం అందించి ప్రాజెక్టు పూర్తి చేయాలన్నారు. పైడిగాం ప్రాజెక్టుకు గతంలో అంచనా వేసిన రూ.17 కోట్లు మంజూరు చేయాలని, ఈ ప్రాజెక్టు ఆధునీకరించడం ద్వారా మరో 7వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. మందస మండలంలోని కళింగదళ్, డబార్సింగ్, దామోదర్ సాగరం ప్రాజెక్టులను ఆధునికీకరించాలని కోరారు. చీపిగడ్డ ద్వారా వృధాగా పోతున్న నీటిని గోపాలసాగరానికి మళ్లించాలని కోరారు. దశాబ్దాల తరబడి పెండింగ్‌లో ఉన్న నారాయణపురం, తోటపల్లి, మడ్డువలస సాగునీటి ప్రాజెక్టులు పూర్తికి అవసరమైన మొత్తం నిధులను ఈ బడ్జెట్‌లో కేటాయించాలని కోరారు.

విద్యార్థుల జీవితాలతో ఆటలా?


దుంపల లక్ష్మణరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కూటమి ప్రభుత్వ నిరంకుశ పాలనతో విద్యార్థుల బతుకులు అంధకారంలోకి వెళ్లిపోతున్నాయని వైఎస్సార్ సీపీ కళింగ కార్పొరేషన్ మాజీ చైర్మన్, రాష్ట్ర కళింగ సామాజికవర్గ అధ్యక్షుడు దుంపల రామారావు అన్నారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, విద్యాదీవెన, వసతి దీవెన సొమ్ము విడుదల చేసి విద్యార్థులు ఇబ్బందులు పడకుండా పరీక్షలు రాసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. వైఎస్సార్‌సీపీ కంటే అధికంగా ఇస్తానని చెప్పి అధికారం చేపట్టాక విద్యార్థులతో ఆడుకోవడం సీఎం చంద్రబాబుకు తగదన్నారు.

నిరుద్యోగ భృతి జాడే లేదని, సంపద సృష్టించి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ప్రగల్భాలు పలికిన అబద్ధాల బాబు అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీలను గాలికొదిలేశారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం యువత వెయ్యికళ్లతో ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో సచివాలయాల్లో రెండు లక్షలకు పైగా ఉద్యోగాలు కల్పించి యువతను ఆదుకున్నట్లు గుర్తు చేశారు.


ఉపాధ్యాయురాలి ఇంట్లో చోరీ

- జె.ఆర్.పురం పంచాయతీ మహాలక్ష్మీనగర్‌లో ఘటన
- రంగంలోకి దిగిన పోలీసులు


వివరాలు సేకరిస్తున్న క్లూస్ టీం సభ్యులు, (ఇన్‌సెట్లో) ఇంటిని పరిశీలిస్తున్న జె.ఆర్.పురం సీఐ అవతారం

రణస్థలం: మండల కేంద్రంలోని జె.ఆర్.పురం పంచాయతీ మహాలక్ష్మీనగర్‌లో ఉపాధ్యాయురాలి ఇంట్లో దొంగలు పడ్డారు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జామి వెంకటేశ్వరి రణస్థలం ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయినిగా పని చేస్తున్నారు. ఆమె ఈ నెల 15న పర్లాకిమిడి వెళ్లారు. తిరిగి సోమవారం రాత్రి 7.45 గంటలకు ఇంటికి రాగానే తలుపులు పగులకొట్టి, తాళాలు తెరిచి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా వస్తువులు చిందరవందరగా పడి ఉండటం, బీరువా తెరిచి ఉండటంతో వెంటనే జె.ఆర్.పురం పోలీసులకు సమాచారం అందించారు. సీఐ ఎం.అవతారం ఇన్‌చార్జి ఎస్సై జి.లక్ష్మణరావులు ఘటనా స్థలానికి చేరుకుని ఇంటిని పరిశీలించారు. అనంతరం క్లూస్ టీం ఎస్సై భరత్ ఆధ్వర్యంలో సిబ్బంది రామారావు, శ్రీనివాసరావు, కిరణ్‌కుమార్ వివరాలు సేకరించారు. తులం బంగారం, 300 గ్రాముల వెండి పోయినట్లు ఉందని, ఇంకా పూర్తిగా చూడాల్సి ఉందని బాధితులు చెప్పారు. ఇంటి పరిసరాలు తుప్పలతో నిండి ఉండటం, చుట్టుపక్కల సీసీ కెమెరాలు లేకపోవడంతో దొంగతనం సులువుగా జరిగిందని భావిస్తున్నారు.

అయోడిన్ లోపంపై అవగాహన



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

అరసవల్లి: అయోడిన్ లోపంతో శరీరంలో వచ్చే మార్పులు, అనారోగ్య పరిస్థితులపై ఆశావర్కర్లు అవగాహన కలిగి ఉండాలని ఐ.జి.డి. జిల్లా కో-ఆర్డినేటర్ కె.శ్రీనివాసరావు అన్నారు. సోమవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఆశా వర్కర్లకు శిక్షణ నిర్వహించారు. ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్ (ఢిల్లీ) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అయోడిన్ లోపంతో వచ్చే సమస్యలపై శిక్షణ ఇచ్చారు. జిల్లాలో 40 గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టుగా ఆశీర్వాద్ స్మార్ట్ ఇండియా ప్రోగ్రాంను ఐటీసీ ఆర్థిక సాయంతో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ట్రైనర్ డాక్టర్ ఎం.చైతన్య మాట్లాడుతూ అయోడిన్ లోపంతో థైరాయిడ్, క్రిటినిజం, ఎదుగుదల లేకపోవడం, రక్తహీనత, బలహీనం తదితర లోపాలు తలెత్తుతాయన్నారు. అయోడిన్‌తో కూడిన ఉప్పును మాత్రమే వినియోగించాలని, ఆకుకూరలు, గుడ్లు, పాలు, బీన్స్, క్యారట్, బెల్లం, పండ్లను తగు మోతాదులో తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో బాలమురళీకృష్ణ, జిల్లా ఐజీడీ కో-ఆర్డినేటర్ అశోక్ పాల్గొన్నారు.

వేధింపులు తాళలేక యువకుడు ఆత్మహత్యాయత్నం

ఆమదాలవలస రూరల్: మండలంలోని శ్రీహరిపురం గ్రామానికి చెందిన పొన్నాడ సురేష్‌కుమార్ అనే యువకుడు సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాధితుడు రాగోలు జెమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని, ప్రస్తుతం పరిస్థితి విషమంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. చిట్టీ డబ్బులు పూర్తిగా చెల్లించినప్పటికీ చిట్టీ వ్యాపారి వేధింపులకు పాల్పడటంతో తట్టుకోలేక సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు, ఈ మేరకు ఆమదాలవలస పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ ఎస్.బాలరాజు వద్ద బాధితుడు వాంగ్మూలం ఇచ్చాడని కుటుంబ సభ్యులు తెలిపారు.